# మూగ వేదన

## మూకలపాటి మధుసూదన రెడ్డి




"నిజమంటారా ?"

"...........!"

డాక్టరు కళ్ళలోకి చూశాను. డాక్టరు కళ్ళు ఎంతగా నా వైపు చూసినా. నేను సూటి చూడలేకపోయేను. అప్పుడనుకున్నాను, నా ప్రశ్నకు బలం లేదని. నా తెలివితక్కువ కాకపోతే, ఇటువంటి విషయాన్ని తమాషాలాడటం కోసం చెప్తాడేమిటి? చెప్పడు! నా అనుమానానికి నాకే సిగ్గేసింది. ఆ విషయం విన్నాక, ఆ క్షణంలో నా గుండెలు వేగంగా కొట్టుకున్నా, పైకి కనిపించనీలేదు. కారణం– నే నే విషయంలోనైనా అంతే! నాది మొండిపట్టు. అలాగే ఇక్కడ కూడా ధైర్యంగా నిలబడగలిగేను. ఒక విధంగా నాకా విషయం సంతోషాన్ని కలిగించింది.

ఊరుకోని నా చేతులు డాక్టరుగారి

టేబుల్‌మీది పేపరు వెయిట్‌ను పరామ ర్శించాయి. రెండుచేతుల్తో పేపరు వెయిట్‌ను ఎగురవేయసాగేను. నా చేతులవైపు చూశాయి డాక్టరుగారి కళ్ళు. నా స్వతంత్రానికి నాకే ఆశ్చర్యం వేసింది. పేపరు వెయిట్‌ను యథాస్థానంలో పెట్టి డాక్టరు వైపు చూసేను.

"చూడు మిస్టర్! డాక్టర్లెప్పుడూ అబద్ధం చెప్పరు కానీ, ఇటువంటి విష యాల్ని చాలామంది డాక్టర్లు పేషంట్లకు ముఖాముఖి చెప్పరు. నా విషయంలో నేనలా ప్రవర్తించలేను. కనుకే నీ కా విషయం తెలియపర్చేను. నీ ధైర్యాన్ని చూచి నేనాశ్చర్యపడకుండా ఉండలేక పోయేను. గాడ్ బ్లెస్ యూ."

డాక్టరుగారి కంఠం విజిటింగ్‌రూమ్ నిశ్శబ్దాన్ని తరిమివేసింది.

డాక్టరు మాటల్తో నా మనసులో ఏవేవో చిలిపి కోరికలు చెలరేగాయి. 'ఛ' అని నాకు నేనే అనుకున్నాను. ఇంకో విధంగా అనుకున్నాను. ఆ నిర్ణయం కూడా నన్ను సంతృప్తి పరచలేదు. ప్రక్క రూముల్లోని ఒకటి రెండు గదుల్నుంచి రోగుల మూలుగులు అప్పుడప్పుడు విన్పిస్తున్నాయి. వాటన్నిటినీ గాలికి వదిలేసేను. నా బుద్ధి ఆలోచనల్తో బద్ధలౌతుంది. ఏవో మాటలు ప్రక్కనుంచి వినిపించాయి. డాక్టరు వాటన్నిటికీ సమాధానం చెబుతున్నాడు. అప్రయత్నంగా కుర్చీ నుంచిలేచేను. డాక్టరు వచ్చిన పేషంట్లతో బిజీగా ఉన్నాడు. మళ్ళీ కుర్చీలో కూర్చున్నాను.

ఐదు నిముషాలు గడిచింది.

వచ్చిన పేషంట్ల బాధలు డాక్టరు గార్కి పీడోక్కలు చెప్పాయి కానీ, నా బాధ ఇంకా డాక్టర్ను వదిలిపెట్ట లేదు. డాక్టరు రెండుచేతుల్లోనూ తలను దాచుకున్నాడు. 'పాపం! విసిగిపోయాడు కాబోలు!' అని అనుకున్నాను. నా అలసటను మరచిపోయి, లేచి డాక్టరు గారికి ఎదురెళ్ళేను.

"సార్!" అన్నాను.

మెల్లిగా నా వైపు చూసేడు డాక్టరు. డాక్టరు నా సమాధానం కోసం ముఖాన్ని ప్రశ్నార్థకం చేసేడు.

"నేనిక వెళ్ళొస్తాను," అన్నాను.


డాక్టరు నుంచి ఏ సమాధానమూ రాలేదు, చిరునవ్వు తప్ప. బహుశా ఆ విధంగా ప్రవర్తించడం ఆయన మతం అనుకున్నాను. డాక్టరుతో పరిచయం అదే మొదలయినా—చిరపరిచయస్తుడిలా ప్రవర్తించేను. నా చొరవకు నేనే ఆశ్చర్యపోయాను.

వెచ్చటి ఫ్యానుగాలికి గుడ్‌బై చెప్పేను నర్సింగ్‌హోమ్ కాంపౌండ్ దాటి వీధిలో కొచ్చేను. మధ్యాహ్నం కావడంవల్ల రోడ్డేమంత రద్దీగా లేదు. హాస్పిటల్ బోర్డువైపు చూసేను. నాలో

నాకే నవ్వొచ్చింది. 'కదలకుండా మెదలకుండా ఎందరు పేషంట్లను ఆహ్వానిస్తుందో! మరెందరకు వీడ్కోలు చెప్తుందో ఈ బోర్డు. పాపం డాక్టరు దీని జన్మకు కారకుడు. అయినా దీని బాగోగులు పట్టించుకోడు. ఎండకు ఎండి, వానకు తడిసి, మంచుకు నాని, చలికి వణికినా దీనికి రోగం రాలేదే!? కొద్దిగా తేరిపార చూసాను. నాదే పొరపాటు. ఆ ఒళ్ళంతా ఆ బొప్పిలేమిటి? అందంగా తళతళ లాడవలసిన ఈ ప్రాయంలో, ఆ నలుపు చుక్క లేమిటి ? అన్నట్టు మరిచేపోయేను. తెల్లగా పైనుంచి కిందికి చారలు చారలుగా జార్తుందే అదేమిటి?' నా మనసులోని ప్రశ్నలివి. ప్రస్తుతం నా మనసు రెండుగా చీలింది.

'కాకిరెట్టలు' నా రెండవ మనసు నా మొదటి మనసు ప్రశ్నలకు సమాధాన మివ్వసాగింది.

'మైడియర్ బ్రదర్ ! నేను కష్ట జీవిని. నాకు రేయని పగలని భేదమే లేదు. ఈ వీధిలోనే నిలుచునుంటాను. నీకో సందేహం రావచ్చు. అస్తమానం, నెలలు, సంవత్సరాలు నిలుచునే ఉంటే కాళ్ళు నొప్పి పుట్టవా ? అని, నాకు సమస్యే లేదు. చూడు! డాక్టరు ఏ విధంగా నన్ను సిమెంటు దిమ్మెలకు ఇనుప కమ్మీలతో బంధించాడో. నా కెన్నో రోగాలున్నాయి రోగిష్టిని. రోగిష్టుల నాహ్వానించక నేనేం చేస్తాను. అనారోగ్యులే నాకు స్నేహితులు. ఆరోగ్యవంతులు నా వైపు కన్నెత్తి కూడా చూడరు. నా బాధలు చెప్ప లేనివి. చూడు! నా ఒళ్ళెలా ముడతలు పడిందో. ఎండకీ వానకీ ఎలా నల్లగా మారిందో. డాక్టరు రాగానే గోలచేసి ఏడ్చినంత పని చేస్తాను కానీ, నా మేలు చూచేదెవరు? ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుంటారు. నన్నొక్కసారి కూడా పరామర్శించడు, నేను చస్తే తప్ప. నే నందరినీ నవ్వుతూ పలకరించాలి. కొందరు నా నవ్వుకు ఆకర్షితులౌతారు. కొందరు వికర్షితులౌతారు. కొందరు కోరచూపులు చూస్తారు. అల్లరిపిల్లలెలా పేడ విసిరారో. ఈ త్రోవన పోయే ప్రతి కాకి నామీద బైఠాయిస్తుంది. అటు ఇటు గెంతుతుంది. చెవులు తూట్లు పడేలా అరుస్తుంది. చివరకు రెట్టను నాకు మిగిల్చి తనదారి తాను చూసుకుంటుంది. ఇవన్నీ నేను భరించాలి. చూడు నేస్తం! ఈ ప్రపంచంలో ఎవరికెవరు ఏమౌతారో నాకు తెలీదు. నీకు తెలీదు. మరెవ్వరికీ తెలీదు. తాత్కాలిక బంధాలే ఇవన్నీ. ఎవరి స్వార్థం వారికే స్వాగతం పలుకుతుంది. నిన్నూ, నన్నూ గుర్తించేవారే ఉండరు. నా బాధలే ఇంత సేపూ చెప్పుకున్నాను. నీ బాధ లేవో ఒక్కటీ వినలేదు బహుశా నా బాధల్లో కొన్ని నీవై ఉంటాయి కనుకే




ఇంతసేపూ ఎండలో నుంచుని నే చెప్పే పురాణం శ్రద్ధగా విన్నావు. ఇక వుంటాను.

నా తల ఆలోచనల్తో బ్రద్దలౌతుంది. నా మనసులు రెండూ ఏకమైనాయి. ఆలోచనలను బలవంతంగా అవతలకు నెట్టేను. నా ఒళ్ళంతా వేడిగుంది. చెమటలు కారిపోతున్నాయి. ఏదో వాహనం పెద్దగా రొద చేస్తూ ముందుకు దూసుకుపోయింది. రేగిన దుమ్ము నన్ను పూర్తిగా ఆవరించింది నన్ను నేను పరిశీలించుకున్నాను. నా కళ్ళకు నేను కనిపించలేదు. కళ్ళు నులుముకుని మరీ చూసేను. ఇప్పుడు కాస్త దుమ్ము తెరలు పలుచబడినై. కాళ్ళు తీస్తున్నాయి. నిలబడున్నానో, కూర్చున్నానో నాకేంతెలీదు తల ఒక్కసారి విదిలించేను. నెమ్మదిగా నడక సాగించేను.

నున్నటి తారురోడ్డు మండుతుంది.

కాళ్లు పెనంమీది రొట్టెల్లా వేగుతున్నాయి.

నెత్తి కాల్తుంది. ఒళ్ళు కాల్తుంది.

కాలండల్లా ఒక్కటే.

స్వార్థం!

ఇక నడవలేకపోయేను. నా కాళ్ళు నాపై తిరుగుబాటు చేసేయి. దగ్గరలో ఉన్న చెట్టు నీడన కూర్చున్నాను. క్రమక్రమంగా ఈ లోకంలో కొచ్చేను.

కొద్దికాలం మౌనంగా గడిచింది.

నా ముందో రిక్షా!

ఆగింది.

మోర పైకి సాచేను.

రిక్షాపై ఓ ఆకారం!

నన్ను చూసి నవ్వింది.

నవ్వినప్పుడు ఆ గారపళ్ళు, ఆ మాసిన గడ్డం, ముఖంపై ఆ మడతలు అన్నీ కలిసి నన్ను ఆసక్తుడిని చేసినై.

అవును మరి ఆర్ట్ ఫిలింలో పాత్రలన్నీ సహజంగానే ఉంటాయి. నేను రచయితను కావాలనీ, మంచిపేరు సంపాదించాలనీ, సహజత్వానికి వీలైనంత దగ్గరగా రచనలు చేయాలని ఎన్నో కలలు కనే వాడిని. కన్నది కలలే! ఇలకాదు.

ఎందుకనో రిక్షా మనిషిని చూడగానే నాలో దాగిఉన్న రచయిత నన్ను వెన్ను తట్టేడు. 'నా కథల్లోని పాత్రలు ఇటువంటివే!' అని మరీ మరీ గుర్తు చేసేడు.

నా ఊహల మేడల కంతులేదు. నా ఊహల మేడలు ఆకాశాన్నందు తున్నాయి!! అంటుకోబోతున్నాయి!!!

"బాబూ!...రిక్షా?..."

ఆకాశాన్నందుకుంటున్న నా ఊహల మేడలొక్కసారి కూలిపోయినై. వాటి మధ్యనుంచి చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లు ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చేను. రిక్షా మనిషిని నిశితంగా పరిశీలించేను. ఆ ముఖంలో స్వార్థం కనిపించటంలేదు. స్వార్థపరులకోసం తనలోని ప్రతి రక్తపుబొట్టు పైసలుగా మార్చినట్టున్నాడు. ముఖం రక్తంలేక పాలిపోయినట్లుంది. ఇంత వృద్ధాప్యంలో కూడా తనను వదలని బాధ్యతల రిక్షాను తనొక్కడే మోస్తున్నాడు. బహుశా అది అతని స్వార్థం కాబోలు.

'ఈ లోకంలో స్వార్థానికి విరోధు లెవరూ లేరా?'

లేరు!

ఉన్నారు!

లేరు!!

ఉన్నారు!!

నా మనసులు రెండూ గుద్దులాడు కున్నాయి. ఇది నా మనసులోని శేష ప్రశ్న. తల్లిగర్భంలో ఉండగానే తన స్వార్థం కోసం తల్లిని పీల్చి పిప్పి చేస్తాడు. భూమిపై పడగానే అన్నీ నావంటాడు. నా స్వార్థం నన్నిలా కఠ తేర్చింది. ఎక్కడ చూచినా స్వార్థం. ఏ మూల నక్కినా స్వార్థం తరుము తూనే ఉంటుంది. పీల్చే గాలిలో స్వార్థం. నీటిలో స్వార్థం. గతుకులో స్వార్థం. మరి స్వార్థం లేనిదెక్కడ? ఎటు చూచినా స్వార్థమే.

స్వార్థం!...స్వార్థం!!..స్వార్థం !!!

ముఖం కందగడ్డలా ఎఱ్ఱగా మారింది. నా మెదనరాలు వుబ్బి ఒక్కసారి చిట్లినట్లయింది. మెదడు మొద్దువారింది. నాలోని రక్తమంతా లావాలా పొంగసాగింది. రగులు కుంటున్న మంటలో నీటిని వెదజల్లి నట్టు నా భుజంమీద చల్లని చేతి స్పర్శ. నాలోని ఆవేశమంతా చప్పగా చల్లారి పోయింది.

"అదేటి బాబూ! ఇందాకట్నుంచి సూత్తన్నాను, తవరీ లోకంలో లేనట్టు న్నారు. అలా నిలుగుడ్లేసుకుని నన్నే సూత్తన్నావేం? నా ముకంల

బొమ్మ లాడ్తున్నయా? నేక నేనేవన్న సినిమా యాకటేరునా?" రిక్షా మనిషి తగ్గుస్థాయిలో నవ్వేడు. కోతి కిచకిచ మన్నట్టుందా నవ్వు. నా కా నవ్వు చాలా బాగా నచ్చింది. ఆనందంగా అతని ముఖం లోకి చూసేను. నా కే సమాధానమూ దొరకలేదు. దొరికినా ఇచ్చేవాడిని కాను.

లేచి నుంచున్నాను. ఎక్కమన్నట్టు రిక్షా మనిషి పక్కకు జరిగి వినయంగా నిలుచున్నాడు.

'ఛీ!...ఛీ!...ఏమి లోకం ఇది. వట్టి బానిస లోకం. ప్రతి ఒక్కరికీ వ్యక్తి స్వాతంత్ర్యం వుంది. ఆ స్వాతంత్ర్యం ఎక్కడ? ఏదీ - ఉంటే కనిపించదే! ఎందుకుంటుంది ? వెట్టిచాకిరనే తన ఆగర్భశత్రువుకి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని గ్రహించి వుంటుంటి. వెట్టిచాకిరీ ధనపిశాచానికి లోబడింది. అందుకే, వాటి రెంటికీ తరతరాలనుంచే తీరని పోరు.

దబ్బున్నవాడికి దబ్బు లేనివాడు!
బలవంతుడికి బలహీనుడు!
చిన్నవాడికి పెద్దవాడు!
పెద్దవాడికి చిన్నవాడు!

ఎప్పుడూ లోబడి ఉండవలసిందే. భూమి తన చుట్టూ తాను తిరుగు తున్నంతవరకు వీధి మధ్య ఘర్షణ చెలరేగుతూనే ఉంటుంది.

ఘర్షణ!...ఘర్షణ!!...ఘర్షణ!!!
దేనికోసం ఈ నిరంతర ఘర్షణ ?
స్వార్థం కోసం!
దేనికోసం ఈ స్వార్థం ?
పదవికోసం!
దేనికోసం ఈ పదవి ?
అధికారం కోసం! దబ్బుకోసం!

పదవులు కేవలం స్వార్థపరుల నేస్తాలు.

ఓ గ్రామంలో ఓ పదవి.

ఆ పదవి చుట్టూ ఎన్నో ఆకలి డొక్కలు! ఏడుపు గొంతులు!

ఆ పదవిపై మరో పదవి.

ఆ పదవి చుట్టూ మరెన్నో డొక్కలు! రెక్కలు! అరుపులు!

ఆ పదవిపై మరో పదవి.

దాని చుట్టూ ఎన్నో అడ్డుదారులు. ఎన్నో పాపాలు! మరెన్నో ఆల్లికలు! దానిపై మరో పదవి. మరో పదవి. మరెన్నో పదవులు.

ఈ పదవుల సోపానాలను అధిరో హించడానికి హిమ శిఖర విజేతలు పనికిరారు. సామాన్యులు ఆ దాపులకే రారు. రాలేరు!

మరెవరు?

పదవుల నేస్తాలు!

నాలోని రచయిత జ్వలించాడు. జ్వలించి విప్లవకారుడైనాడు. విప్లవ జ్యోతిని నాలో వెలిగించేడు. విప్లవం నాలోనే కాదు ప్రతి పీడితమానవుడిలో రావాలి. అందరూ కలసి ముందుకు నడవాలి!

నడిచి?

ఆపై ఎంత రోధించినా నా ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది.

అప్పుడప్పుడే గుర్తొచ్చాయి, మహా కవి శ్రీ శ్రీ విరచిత విప్లవ గేయాలు.

నా కళ్ళముందివన్నీ చేరి నన్ను పిచ్చివాడ్నిగా మార్చ యత్నించాయి. నేను ఆలోచన మాత్రమే చేసేను. ఆచరణ విషయం భవిష్యత్తుకు వదిలేను.

రిక్షా మనిషి నిలుచునే ఉన్నాడు. రిక్షా ఎక్కాలని లేకపోయినా, ఆ మనిషి ఆశ నిరాశ చేయగూడదనుకున్నాను. జేబు తడుముకున్నాను. డబ్బులు చాలేట్లు లేవు. అవి నేను కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులు. నా బాగోగులు నా వాళ్ళు పట్టించుకోలేదు. వాళ్ళ స్వార్థం వాళ్ళది. నా స్వార్థంకోసం నా స్వార్జితాన్ని ఇప్పుడు వినియోగించు కుంటున్నాను. ప్రతి చిన్నవిషయానికి నాలో తర్జన భర్జన జరుగుతుంది. ఇప్పుడు కూడా!

రిక్షా ఎక్కడానికే నిశ్చయించు కున్నాను. అదేదో సెంటరు గుర్తులు చెప్పేను. అర్ధరూపాయవుద్దని చెప్పేడు. వద్దనలేదనుకున్నాను. బేరమాడనందుకు కళ్ళతోనే తృప్తిని తెలిపేడు రిక్షా మనిషి.

రిక్షా ఎక్కేను.

తోలు కప్పుకున్న ఎముకల గూడు తొక్కుతుంది.

పాతబడిన ఇనుపగూడు పోతుంది.

గతుకుల్లో పడిన ప్రతిక్షణం నా ఒళ్ళు హూనమవుతుంది.

రిక్షా తొక్కడానికి ఎముకలగూడు విఫల ప్రయత్నం చేస్తుంది.

ఈ బాధ చూడలేక నా గుండె వేగం హెచ్చింది.

భగవాన్! ఈ భేదాలేమిటి ?

ఒకడు గరీబు! వేరొకడు నవాబు!

ఒకడు సేవకుడు! వేరొకడు మహా రాజు!

ఒకడిది ఆకలి గోల! వేరొకడిది అజీర్తి గోల!

వీటితో నా మనసు నా అధీనం తప్పింది. ఒకటి రెండు నిముషాలు భారంగా దొర్లాయి.

సెంటరొచ్చింది.

రిక్షా మనిషిని విజయలక్ష్మి వరించింది!

నా బాధ కాస్త సడలింది.

రిక్షా దిగేను. అర్ధరూపా యిచ్చేను. నిరాశతోకూడిన తృప్తితో నానుంచి దూరమయ్యేడు. నాకు చాలా బాధని పించింది. అతలితోనే...అతనెక్కడకు పోతే అక్కడికే పోవాలనిపించిందా క్షణాన.

సాయం సమయం కావడంతో సెంటరు చాలా రద్దీగానే ఉంది. సాయంకాల మేమిటి, ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. నాకు దిక్కు తోచలేదు.

పది నిముషాలు ఆగి నిదానంగా రోడ్డు అవతలకు చేరేను. ఫుట్‌పాత్ మీద నడవనారంభించేను. పట్టణం ముఖం చూడడం నాకు తెలిసినంతవరకు ఏ మూడో మారో అయి వుంటుంది. నేను చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు మా తాతయ్యతోటే ఎప్పుడూ పట్నంలోనే ఉండేవాడినని మా అమ్మ చెప్తుంటే విన్నాను. ఇప్పటికి మూడు నెలల క్రితం పుస్తకాలకని, బట్టలకని నా ఫ్రెండ్‌తో పట్టణానికి వచ్చేను కాని, నా కంత బాగా గుర్తులేదు. పక్కగా ఏదో శబ్దమైంది. అదేదో గమనించే లోపలే బస్ ఒకటి నా మీదకు దూసుకొచ్చింది. అంతే! నేను ఫుట్‌పాత్ మీద పడిపోయేను. నేను పడలేదు, ఎవరో లాగి పారేశారు. నా చుట్టూ నలుగురైదుగురు మూగేరు. నన్ను రక్షించిం దెవరో కనుగొనడం కష్టమైంది. వాళ్ళలో ఒకతను నోరు చేసుకున్నాడు.

"ఏమయ్యా! ఈ లోకంలో వున్నావా లేవా? అలా నడిరోడ్లకి నడుస్తావేం?" రెండు నిముషాలనుంచి హారను మ్రోగిస్తుంటే పక్కకు తొలగవేం?" కొంచెం విసురుగా మాటలను విసిరేడు. మాటలనుబట్టి ఆ వ్యక్తే నన్ను రక్షించిందనుకున్నాను. నేనే సమాధానమూ ఇవ్వలేదు. అసలు అటువంటి సమయాల్లో నాకు మాటలు రావు.

పైకి లేచి బట్టలకయిన దుమ్ము దులుపుకున్నాను. నా చుట్టూ ఉన్న గుంపు తొలగిపోయింది నన్ను రక్షించిన వ్యక్తికి కళ్ళతోనే నా కృతజ్ఞతను తెలిపేను. స్వీకరించాడో లేదో నాకు తెలీదు

"ఇకనైనా కాస్త ముందుచూపుతో నడువు," అని తన దారిన తాను పోయాడు.

బస్ స్టాండ్‌ను సమీపించేను. గోడ మీది సినిమా పోస్టర్లలో ఒకటి నన్నాకర్షించింది. చిత్రం పేరు "పదండి ముందుకు పదండి తోసుకు." వెంటనే నాకు మహాకవి శ్రీ శ్రీ జ్ఞప్తికొచ్చేరు. శ్రీ శ్రీ వెనుకే విప్లవం నన్ను పురికొల్పింది. ఆ చిత్రాన్ని తప్పకుండా చూడాలనిపించింది. నా నమ్మకం వమ్ము అయింది. పరిసరాలను విచారించగా అది ఓ బూతు చిత్రం అని తేలింది. ఇక సినిమా పోస్టర్లకు తిలోదకాలిచ్చి మా వూరు బస్‌ను వెతుక్కుంటూ బస్‌స్టాండ్‌లోకి ప్రవేశించేను.

* * *

బస్ దుమ్ము రేపుకుంటూ పెద్దగా రొద చేస్తూ మా వూరు బస్ స్టాప్‌లో ఆగింది. ఎర్రటి దుమ్ము తెరలు బస్‌లో జనాన్ని పరామర్శించాయి. అందరూ ముఖాలకు, ముక్కులకు కర్చీఫ్‌లు పెట్టుకున్నారు. నేను మాత్రం ఏమీ పెట్టుకోలేదు. మా వూరు దుమ్ము రుచి నాకు బాగా తెలుసు. బస్ చాలా రద్దీగా ఉన్నందువల్ల బస్‌లోని జనం

ఒక్కరొక్కరే తాపీగా దిగుతున్నారు. ఒకరిద్దరు ప్రయాణీకులు బస్‌లోని జనం ఎప్పుడు దిగుతారా అని గోరీ కింద నక్కల్లా మా పూరు చింతచెట్టు కింద కాచుక్కూర్చునున్నారు. నేను అందరూ దిగిన తర్వాత దిగుదామను కున్నాను. ఒళ్ళు వేడిగా ఉంది, కళ్ళు విపరీతంగా నొప్పి పుడుతున్నాయి. తల దిమ్మెక్కిపోయింది. సాయంత్రం ఆరు కావడంతో ఒళ్ళంతా పులకరింతలు, చలి చలిగా ఉంది. ఊళ్ళో అక్కడక్కడ శిలాశాసనాల్లా నిలబడున్న కరెంటు స్తంభాలు గుడ్డి గుడ్డిగా వెలుగుతున్నాయి. ఎక్కువదూరం ప్రయాణించినందువల్ల బస్ హీటరులో నీళ్ళు పోస్తున్నాడు క్లీనరు. పాపం! ఎంత దాహం అయిందో రెండు బక్కెట్ల నీరు తాగేసింది బస్. బస్ ఆరాటం తగ్గింది. నా ఆరాటం అధికమైంది. బస్‌లో ప్రయాణీకులు పలచబడ్డారు. దిగటానికి లేచేను. ఒళ్ళంతా నొప్పులు నాతో స్నేహం చేసేయి.


బస్ దిగేను. ఎప్పుడూ పూర్లోనే వుండడం వలన ఒక్కరోజు పూరుకు దూరమయ్యేసరికి నా కంతా కొత్తని పించింది. బస్ స్టాండ్‌ను పరిశీలించేను. పూళ్ళో జనమంతా బస్ స్టాండును ప్రేమించినట్టున్నారు. షోడా కొట్టులో మ్రోగే షోడాల గోల బస్ స్టాండ్ గోలను మించి వినిపిస్తుంది. బస్‌స్టాండ్ ఎడమవైపు కిళ్ళీకొట్టు కోలాహలం. పొద్దస్తమానం పొలాల్లో పనిచేసిన కష్టజీవులు అస్తమయం అవడంతో ఇంట్లోపని పెళ్ళాల కప్పజెప్పి బస్ స్టాండ్‌లో పచార్లు చేస్తున్నారు. మా పూరు బస్ స్టాండ్ మరో భారతదేశం. అందులో అన్ని వర్ణాల వారున్నారు. పడినచోట స్నేహభావం, పడనిచోట కుస్తీ భావం. పనెగ్గొట్టి తిరిగే సోమరిపోతులు, రౌడీగాళ్ళు, బిచ్చగాళ్ళు, ఉత్తములు, స్వార్థపరులు, విప్లవకారులు, వ్యాపారస్తులు, కుంటివాళ్ళు, గుడ్డివాళ్ల ఇంకా ఎందరో!

నాకు కొంచెం దూరంలో ఏదో కలకలం రేగింది. నే నటు వెళ్ళలేదు. చూసేను. అప్పటికే ఓ గుంపు తయారయిందక్కడ. నేను విచారించకుండానే నాకా విషయం తెలిసింది. ఎవరో ఎవరికో బాకీ అట. అదీ గోల. 'వడ్డీ బాకీ బతుకులు' అని నాలో నేనే సణుక్కున్నాను.

తలొంచుకుని ఇంటివైపు దారి తీసేను. అప్పుడే కాలుతున్న బజ్జీల వాసన వచ్చి తలెత్తి చూసేను...

బజ్జీలంగడి నరిసింహులు పలకరిస్తున్నట్టు నవ్వేడు. నేనూ అంతే! ఇక అక్కడ నిలవలేదు, ముందుకు పోయేను.

బజ్జీలంగడి నరిసింహులు నాకు బాగా తెలుసు. రెండు మూడుసార్లు




అప్పుగా బజ్జీలు కూడా తిన్నాను. చాలా మంచోడు. ఆ బండిమీదే కుటుంబా న్నంతా తనొక్కడే పోషించాలి. తండ్రి చూస్తే కుంటివాడు. రోగిష్టి. ఇక తల్లి చెల్లి, తమ్ముడు నరిసింహులుకు పనిలో సాయపడతారు. నరిసింహులు మాట కారి. ఔను మరి, ఈ రోజుల్ని బట్టి డబ్బులు సంపాదించాలంటే మాటకారై ఉండాలి. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాడు. నే నాలోచన్లనుంచి తేరు కునేసరికి మా యిల్లవతల రెండిళ్ళు దాటిపోయేను.

ఇల్లొచ్చింది!

నా వంట్లో కేదో జంకొచ్చింది.

ఇంటి చూరుల్లోంచి గుడ్డి వెలుతురు తొంగి చూస్తోంది. వంటింట్లో కాబోలు... ఏదో గిన్నెల శబ్దం, మాటల శబ్దం అవుతుంది. మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టేను. నా వూహ నిజమైంది. ఇంట్లో అమ్మలేదు. వంటింట్లో వుంది. నడి మింట్లో మంచంమీద నాన్న కాబోలు కూర్చున్నాడు. నన్ను చూడగానే—

"ఎవరా మనిషి?" అని అప్పుడే నన్ను గుర్తించినట్టుగా ఉండిపోయేడు. నేను పక్కగదిలోకి పోయి మంచంపై కూర్చున్నాను. ఒళ్ళంతా నొప్పులు, జ్వరం, తలనొప్పి. నా ఒళ్లు ఏదో లోకాల్లో తేలుతున్నట్టుంది. నేనున్న గది వంటిల్లుకు అనుకునిఉంది. వంటింట్లో నాన్న అమ్మనేదో అడుగుతున్నాడు.

"ఏమేవ్! వాడొచ్చాడు." నాన్న ఆత్రుత.

"వచ్చాడా! ... చచ్చాడా! ..." అమ్మ కోపం.

"అది కాదే! ... వాడెక్కడికి పోయాడో...ఏమో..."

నాన్న మాటలను మధ్యలోలి మింగే శాడు. అమ్మ కళ్ళెర్రజేసి వుంటుంది.

"ఎక్కడికి పోతాడు నీ ముద్దుల కొడుకు. ఊరంతా చెడతిరిగుంటాడు. అబ్బ!...ఎంత ప్రేమ, కొడుకుమీద. నువ్వున్నావుగా కన్నతండ్రివి. పోయి విచారించు." నాన్న మారు మాటాడ లేదు. కొద్దిసేపు మౌనం. అసలు నాన్నకు అమ్మను చూస్తేనే భయం, ఎక్కడ కరుస్తుందో అని. ఇంట్లో అమ్మకి జడవందల్లా నేనే! చివరికి అన్నయ్యకూడా అమ్మ మాటకి బదులు చెప్పడు! చెప్పలేడు!! అలా తయారు చేసింది అమ్మ. తన మాటే ఎప్పుడూ చెల్లాలంటుంది. ఇంట్లో అందరిమీదా తన ఆధిక్యతే ఉండాలంటుంది. అందర్నీ తన మాటకింద నడిచేట్టు చేసుకుంది. నన్ను మాత్రం వదిలేసుకుంది. నేను అమ్మ ప్రతి మాటకీ ఎదురు చెప్పే వాణ్ని. అందుకే నాకూ ఆమెకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. దీని కంతటికి కారణం స్వార్థం. ఆమె స్వార్థం ఆమెనలా బిడ్డలమీద ప్రేమ, మమకారాన్ని తుడిచివేసింది. సర్వం హరించే శక్తి స్వార్థానికుందని అర్థ మయింది. ప్రేమకు స్వార్థం శత్రువు. ఒకప్పుడు నేనంటే అంత ప్రేమ లేక పోయినా,కాస్త బాగా ఉండే అన్నయ్యకు, అక్కయ్యకు, నా మీద లేనిపోనివి నూరిపోసి నిర్దాక్షిణ్యంగా నన్ను ఓ ఏకాకిని చేసింది. ఎందుకో నామీదింత పగ, ద్వేషం. నే నంటే అక్కయ్యకు, అన్నయ్యకు ముఖ్యంగా అమ్మకు ఎలర్జీ. ఒక్కోరోజు నాకు ఏడుపొచ్చే టంత పనయ్యేది. ఆ సమయంలో పిల్లాడిలా యేడ్చేసేవాడిని కూడా! ఎవరెన్ని అన్నా నేను వినిపించుకునే వాణ్నికాదు. అసలు వాళ్ళ మాటలు నాకు వినబడేవి కాదు. నా మనసును రాయి చేసుకున్నాను. వీరి మధ్య కేవలం బండరాయిలా మారిపోయేను. ఇక వాళ్ళెన్నన్నా నాకేం. నేను బండ రాయిని.

నేనంటే ప్రేమా,మమకారమూ వున్న వ్యక్తి ఒక్కడే! మా నాన్న. నాన్న అమ్మకు భయపడి తన ప్రేమను బహిర్గతం చేసేవాడు కాదు. ఆయనది అంతర్గత ప్రేమ. ఆయన మాటలంటే నాకు ఆనందం. ఆయన పలకరిస్తే భోరున ఏడ్చేయాలనిపిస్తుంది. అందుకే నాన్నంటే అమ్మకి ఎలర్జీ.

నా ఆలోచనలకు మధ్యలోనే ఫుల్ స్టాప్ పడింది.

"ఏరా! ఎక్కడికెళ్ళావు ?" నాన్న పలకరించేడు. నాలో గోరంత సంతోషం కొండంతైంది. నా ఆరవ ప్రాణం నాన్న. నన్ను పలకరించేడు.

"పట్టణానికి."

"దేనికి?" ఈ మారు గొంతు స్థాయిని తగ్గించేడు.

"డాక్టరు దగ్గరకు."

నాన్న నుంచి ఏ విధమైన సమాధానమూ రాలేదు. సమాధానంగా నాన్న కనుకొనుకుల్లో కన్నీళ్ళు తిరిగాయి. నా పరిస్థితి నాన్నకు బాగా తెలుసు. అందుకే అలా అయేడు. నా ఆనందం క్షణంలో మాయమైంది. నా గుండె వేగంగా కొట్టుకుంది.

* * *

కాలం గర్భంలో ఓ రెండు మాసాలు జీర్ణించిపోయేయి. నా పరిస్థితి మరీ హీనమైంది. అది చూడలేక నాన్న హృదయం తరుక్కుపోతుందని నేను గ్రహించేను. నేను రచయితనయ్యేను! ఎవరి దృష్టిలో? నా దృష్టిలో. ఎన్నో కథలు రాసేను. కొన్ని మంచివను కున్నవి పత్రికలకు పంపేను. ఆశా జ్యోతుల్ని కళ్ళలో వుంచుకుని ఎదురు చూడసాగేను.

ఆ రోజు ఉదయం...!

నే నొంటరిగా ఇంట్లో పడుకుని ఏదో ఆలోచిస్తున్నాను.

"పోస్టు" అన్న పిలుపు విని ఆగ మేఘాల మీద ఇంట్లోనుంచి బయట పడినాను. పోస్టుమాన్ అందించిన కవరు చూడగానే నా ఆశాజ్యోతులు ఆరి పోయాయి.

నేను పంపిన కథలు తిరిగొచ్చాయి!

నాలో కోపం, కసి ఒక్కసారి కట్టలు త్రెంచుకున్నాయి. ముఖమంతా చెమటలు పట్టాయి. నాలోని రచయిత నాకు ధైర్యాన్ని నూరిపోస్తున్నాడు. ఇన్నాళ్ళూ కష్టపడి ఇంట్లోవాళ్ళకు బంధనై మొండిగా రచించిన కథలు, నాలోని విప్లవ రచయిత చేసిన రచనలు.

తిరిగొచ్చాయి!

నాకు పత్రికలమీద విపరీతమైన రోత పుట్టింది. కొత్త రచయితలకు ప్రోత్సాహమివ్వలేని పత్రికలెందుకు అనుకున్నాను. నా ధ్యేయం మరువలేదు. నేను రచనలు చేస్తూనే వున్నాను.

* * *

కాలచక్రం మరో మాసాన్ని వెన కేసింది. నేను రచయితను కాలేదు. నన్ను, నా విషయాల్ని పట్టించుకునే వాళ్ళే కరువయ్యేరు. అడవిలో మోడులా బ్రతుకుతున్నాను. శ్వాస పీలుస్తు న్నానో వదుల్తున్నానో నాకే తెలీదు. అప్పుడప్పుడు నాకు చలిజ్వరం తగిలేది. ఆ సమయంలో నా బాగోగులు చూచేది నాన్నే. అదీ అమ్మకు తెలీ కుండా. అంత భయమెందుకో నాన్నకి. బహుశా ... నామీద మమకారంతో కాబోలు. నన్ను గురించి ఎన్నోమార్లు నాన్న అమ్మచేత చివాట్లు తిన్నాడు. నేను మానసికంగా బలహీనుణ్ని అయినాను. శారీరకంగా కూడా!

ఆ రోజు మధ్యాహ్నం నేను ఒంటరిగా కూర్చుని ఏదో కర్రతో కుస్తీ పడుతున్నాను. పక్కగదిలోంచి ఏవో

మాటలు వినిపిస్తున్నాయి. అవి స్పష్టంగా ఏవైందీ నేను గ్రహించలేక పోయాను. ఓ అయిదు నిముషాలైంది. నా మంచం చుట్టూ ఏవో నీడలు పాకినై. ఆ నీడల్ని చూస్తే నాకు మొదట భయమేసింది. తలెత్తి చూచేను. త్రిపు రాసురుల్లా నన్నే గమనిస్తున్నారు అమ్మ, అన్నయ్య, అక్కయ్య. నేను ఇంక లేదు, నా కథలోని సన్నివేశాల గురించి ఆలోచించసాగేను.

"ఏరా! ఎప్పుడూ రోగిష్టిలా కూర్చు నుంటావేం?"

అన్నయ్య ప్రశ్న. నేను రోగిష్టినే. రోగిష్టిలా కాదు. నిజంగా రోగినే!

నా కంతా అర్థమైంది. నాపై దండెత్త డానికి సామంతుల్ని వుసిగొల్పింది అమ్మ. అన్నయ్యకు నేను జవాబు ఇవ్వలేదు.

"నిన్నే!...నన్ను కాదన్నట్టు ఏవిటా మూగనోము? పనీ పాటా లేకుండా కూర్చుని తింటానికి నటన."

'నటన! నాది నటనా?' నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. సమాధానం దొరక

గుండెల్లో కత్తితో పొడిచినట్లు గిలగిలా తన్నుకున్నాడు. నాలో ఓర్పు క్షణ క్షణానికి నశించసాగింది.

"మహా నువ్వే కథలు రాసి మమ్మల్ని ఉద్ధరించినట్టు! ఇంట్లోని కాగితాలన్నీ ఈ ముదనష్టపు కథల కోసం ఖరాబు చేసినావు."

అమ్మ ఈసడింపు,


నా దృష్టిలో వీళ్ళు రాక్షసులు. లోకం దృష్టిలో వీళ్ళు నాకు తల్లి, తోబుట్టువులు. వీళ్ళకేం చెప్పాలో తోచ లేదు. నా మనసుకు మాటలు రావు. ఇప్పుడు కాదు, ఎప్పటినుంచో రావు. నా మనసు మూగవోయింది. నేనేం మాట్లాడదామన్నా నామనసు మాటాడనీ లేదు. నాన్న మనసుకూడా అంతే! మావి మూగ మనసులు. మా మనసుల బాసలు ఎవరికీ వినిపించవు. నాకూ మా నాన్నకూ తప్ప. గతంలో జరిగిన సంఘటన గుర్తొచ్చింది. ఆ విషయం విన్నాక నా లేత హృదయం లోలోనే ఆక్రోశించింది. ఏడ్చింది. చివరకు నోదారే. హృదయంలేక మూగ

నాది నటనకాదు కాబట్టి.

"నీ మొహానికి కథలు తక్కువ. అప్పుడే పెద్ద రచయితయినట్టు

అక్కయ్య నిట్టూర్పు. నా అభిమానం దెబ్బతింది. నాలోని రచయిత

అప్పుడేదో విషయం దగ్గర అమ్మ నన్ను కోపంగా "కులం తక్కువ వాడా" అని కసిరింది. అప్పటివరకూ మా అమ్మే అని అనుకుంటున్న నా హృద యంలో అగ్నిపర్వతాలు ప్రేలినాయి.




ఆ విషయం నాన్నను అడిగేను. నాన్న ఎంతో సేపు బుకాయించ యత్నించేడు. కాని నేను నాన్న చెప్పిందాకా వదల్లేదు. అప్పుడు నాన్న నాతో చెప్పిన నా జన్మ రహస్యం నన్ను విభ్రాంతుడ్ని చేసింది!

"ఒరే బాబూ!...నువ్వు మీ అమ్మ కన్న కొడుకువు కాదురా! ... నువ్వు నేను కన్న కొడుకువురా! అని భోరున ఏడ్చేడు. ఆ సమయంలో నాకూ ఏడుపొచ్చింది. నాన్నతో కలిసి నేను ఏడ్చేను. ఈ ప్రపంచంపై రోత పుట్టింది. వట్టి వ్యభిచార గృహం ఈ ప్రపంచం అని అనుకున్నాను. ఆ తరువాత నే నర్థంచేసుకున్నాను. నేనో కులం తక్కువవాడినని. పెళ్ళికాక ముందే కామవాంఛకు బలైన ఓ అమాయకురాలిని పొట్టన పెట్టుకున్న రాక్షసుడినని.

లోకంలో ఎక్కడ చూచినా దారిద్ర్యం మూలుగుతుంది. ఎక్కడ చూచినా పతితులు, భ్రష్టులు. చిగురించని మోడులు. ఈ సమాజానికి శంకుస్థాపనలు వీరే. ఈ సమాజానికి పెట్టుబడిదారులు వీరే. వీరే ఈ సమాజానికి స్వాగతమిచ్చేది. మన చరిత్ర పుటలలో ఏ మూల చూసినా వీరే కనిపిస్తారు. ఎక్కడ చూసినా దారిద్ర్యం, దారుధ్యం తప్ప వేరేమీ కనుపించదు.

ఎందుకీ శృంగార కవులు? ఎవరి నుద్ధరించను? పతితల నుద్ధరించనా? వీరికి గిట్టని పని. పతితపై శృంగారాన్ని వెదజల్లి, శృంగార నాయకగా వర్ణించమంటే భేషుగ్గా వర్ణిస్తారు. లేక భ్రష్టులను చేరదీస్తారా? భ్రష్టులపై మరింత శృంగార భోగాలను చొప్పించి మరింత భ్రష్టుల్ని చేస్తారు. సంఘాన్ని ఉద్ధరించనా? అదంటే

వాళ్ళకు ఎలర్జీ. సంఘాన్ని కాదు తమ రచనలలో కల్లబొల్లి కథలు చొప్పించి, మహారాజుల మతులు పోగొట్టి వారి అనుగ్రహంతో తమ్ము తాము వుద్ధరించుకుంటారు. తాటి చాంతాళ్ళాంటి బిరుదులు పిలకలకు తగిలించుకు తిరుగుతారు.

"ఏరా! అలా మూగ మొద్దులా నిలువుగుడ్లేసుకు చూస్తావేం? మొన్న ఎక్కడి కెళ్ళేవ్?"

అన్నయ్య మాటతో ఉలిక్కిపడ్డాను. అప్పటిదాకా ఆవేశంగా నాతో పేలుతున్న రచయిత నోటిమీద మూత వేసేడు. ఎట్లో గొంతు పెగల్చుకున్నాను.

"పట్నానికి!" అన్నాను. అందరి ముఖాల్లో ప్రశ్నార్థకం తాండవించింది, నాన్న ముఖంలో తప్ప.

"ఎందుకు ?"

ప్రశ్న. వాళ్ళను ఎన్ని రోజుల్నుంచో బాధిస్తున్న సమస్య. ఎన్ని రోజుల్నుంచో నాతోనే స్నేహం కలిపిన సమాధానం.

"డాక్టరు దగ్గరకు." జవాబిచ్చేను.

"మేమంతా కలిసి నీకేమన్నా మందు పెట్టేమనా ?"

అమ్మ అనుమానం నాకు నవ్వొచ్చింది నాన్న మధ్యింట్లో మౌనంగా కూర్చునున్నాడు. ఆయన కళ్ళు, ఆయన మనసు, ఆయన ఆలోచన్లు అన్నీ నామీదే.

"కాదు నా కా దేవుడే మందు పెట్టేడు."

"......?......?......?..."

"నాకు బ్లడ్ కేన్సర్!"

అందరూ స్థాణువుల్లా నిలబడి పోయేరు. నాన్నతో సహా! నాన్న గుండె ఆగిపోయిందేమో అనుకున్నాను! ఆయన రెండు కళ్ళనుంచి కన్నీరు కారింది. కన్నీరు కాదు, రక్తం!

మా యిద్దరి మూగబాధలు మా యిద్దరికే తెలుసు. మావి మూగ మనసులు. ఇక నే నెవ్వరినీ గమనించ లేదు. నా కథలో తల దూర్చేను.

నా కలం ఆవేశంగా ముందు కురికింది.

ముందుకురికిన కలాన్ని వెనక్కి లాగేను.

మళ్ళా వురికింది.

మళ్ళా లాగేను.

విసుగు పుట్టింది.

కలం విదిలించేను.

నా కలం సిరా కోల్పోయింది!...

